ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

తాడ్వాయి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, తక్షణమే అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం భారాస ఆధ్వర్యంలో తాడ్వాయి మండల కేంద్రంలో జరిగిన రైతు రుణమాఫీ ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో సైతం రూ.లక్ష రుణమాఫీ కాని వారు ఎంతో మంది ఉన్నారని విమర్శించారు. సన్న రకం ధాన్యానికి వెంటనే రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండు చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేసే వరకు భారాస తరఫున ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు కపిల్‌రెడ్డి, నాయకులు సాయిరెడ్డి, గోపాల్‌రావు, నర్సింలు, వెంకట్రాంరెడ్డి, శంకర్, ఉమ్మడి తాడ్వాయి మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరడంతో అత్యవసరంగా ఒక వరద గేటును ఎత్తి మంజీరాలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు జలవనరులశాల ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రానికి సాగర్‌లోకి 3700 క్యూసెక్కుల జలాలు చేరడంతో రాత్రి ఒక ప్రధాన గేటు ద్వారా 2700 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటిపారుదలశాఖ గేట్ల ద్వారా 500 క్యూసెక్కులు ప్రధాన కాలువలోకి విడుదల కొనసాగుతోందన్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం నిండు కుండను తలపిస్తోందని పేర్కొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాలు

- నేటి నుంచి విద్యార్థులకు పోటీలు

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం

పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సింధుశర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో నేడు రక్తదాన శిబిరాన్ని చేపడతామన్నారు. సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకొని వివిధ విభాగాల్లో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి కేటగిరీలో ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు 'విచక్షణతో కూడిన చరవాణి వాడకం' అనే అంశంపై, రెండో కేటగిరీలో డిగ్రీ నుంచి అంతకు మించి పైచదువులు చదివే విద్యార్థులకు 'తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశంపై ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు తమ వ్యాసాలను అంతర్జాలంలో పంపించాలన్నారు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. అనంతరం వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోలీసులకు సైతం రెండు కేటగిరీల్లో (కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి వరకు, ఎస్సై నుంచి పై స్థాయి అధికారులకు) వ్యాసరచన పోటీలు చేపడుతున్నామన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో కొత్తగా నిర్మించిన పోలీసు అమరవీరుల స్తూపం

షార్ట్ ఫిల్మ్స్, ఫొటోగ్రఫీ విభాగాల్లో..

పోలీసుల సేవలకు సంబంధించిన ఫొటోలు, రోడ్డుప్రమాదాలు, సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, పోలీసుల కీర్తిప్రతిష్ఠను పెంపొందించే అంశాలు(కమ్యూనిటీ పోలీసింగ్, సామాజిక రుగ్మతలు రూపుమాపడం, అత్యవసర సమయాల్లో, ప్రకృతి వైపరీత్యాల్లో సేవ)పై మూడు నిమిషాలకు తగ్గకుండా షార్ట్‌వీడియోలను ఈ నెల 23 లోపు జిల్లా పోలీసు కార్యాలయంలో ఐటీ కోర్ టీమ్‌కు అందించాలన్నారు. విద్యార్థులు, యువత, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో బహుమతులు ఉంటాయన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, చేసిన త్యాగాలను విద్యార్థులు, ప్రజలకు తెలియజేస్తామన్నారు.

దశ తిరగాలి.. తెవివి మురవాలి

- వీసీగా యాదగిరిరావు బాధ్యతల స్వీకరణ నేడు

తెవివిలో గత పాలకుడు చేసిన అవినీతితో వర్సిటీ ప్రమాణాలు గాడితప్పాయి. ఫలితంగా ఉన్నత విద్య, పరిశోధనలో గుర్తింపునకు నోచుకోలేదు. వర్సిటీ ఏర్పాటయ్యాక ఎక్కువ కాలం ఇన్‌ఛార్జి పాలనే కొనసాగింది. సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం తెవివికి వరంగల్ జిల్లాకు చెందిన ఆచార్య టి.యాదగిరిరావును వీసీగా నియమించింది. ఆయన నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. 16 నెలల తర్వాత రెగ్యులర్ వీసీ వస్తుండటంతో వర్సిటీ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్





పాలన గాడిలో పెట్టాలి

2016లో తెవివి న్యాక్ 'బీ' గ్రేడు సాధించి రాష్ట్రంలో తొలిసారిగా న్యాక్ గుర్తింపు పొందిన వర్సిటీగా పేరొందింది. ఈ గుర్తింపు ముగిసిన వెంటనే మెరుగైన గ్రేడింగ్‌కు మళ్లీ వర్సిటీ సెల్ఫ్ స్టడీ రిపోర్టును సమర్పించాలి. తెవివి తర్వాత గుర్తింపు ముగిసిన రాష్ట్రంలోని పలు వర్సిటీలు(కాకతీయ, పాలమూరు, జేఎన్‌టీయూ) రిపోర్టులు సమర్పించి మళ్లీ న్యాక్ గుర్తింపు పొందాయి. తెవివిలో గత ఉన్నతాధికారులు మాత్రం గుర్తింపు సాధించడంలో మీనమేషాలు లెక్కించారు.

భారీగా ఉద్యోగ ఖాళీలు..

తెవివి డిచ్‌పల్లి ప్రధాన, సారంగాపూర్ ఎడ్యుకేషన్, భిక్కనూరు దక్షిణ ప్రాంగణాల్లో పీజీ, ప్రొఫెషనల్ కలిపి 20 కోర్సుల్లో విద్యనందిస్తోంది. ఈ కోర్సులకు 20 మంది ఆచార్యులు, 43 మంది సహ ఆచార్యులు, 89 మంది సహాయ ఆచార్య పోస్టులు మంజూరయ్యాయి. మొత్తంగా 152 పోస్టులకు గాను ప్రస్తుతం ఉన్నది కేవలం 61 మందే. 91 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక వర్సిటీలో 12 సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు కొనసాగుతుండగా అకడమిక్ కన్సల్టెంట్లు, పార్ట్ టైం అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. ఇక మూడు ప్రాంగణాల్లో ఇప్పటికీ కేవలం 8 మంది రెగ్యులర్ బోధనేతర ఉద్యోగులు ఉన్నారు. 270 మందికి పైగా పొరుగుసేవల ఉద్యోగులున్నారు. కనీసం 250కి పైగా రెగ్యులర్ బోధనేతర ఉద్యోగ పోస్టులు అవసరం ఉంది.

స్నాతకోత్సవ ఊసేలేదు

తెవివి ప్రారంభించి 18 ఏళ్లు అవుతున్నా ఒక్కసారి మాత్రమే స్నాతకోత్సవం జరిపారు. వర్సిటీలో ఇప్పటికీ ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టలేదు. ఉమ్మడి జిల్లాకే తెవివి పరిధి పరిమితమైంది. ఆదిలాబాద్, నిర్మల్, మెదక్ జిల్లాలకు తెవివి పరిధిని విస్తరించాలని గతంలో ఉన్నత విద్యా మండలి భావించి ప్రభుత్వ ఆమోదానికి నివేదిక సమర్పించినా ఇంకా అమలుకు నోచుకోలేదు.

అకడమిక్ వాతావరణం నెలకొల్పాలి

వర్సిటీలో అధ్యాపకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. చాలా మంది వారానికి ఒక్కసారైనా వర్సిటీ మొహం చూడకుండా, విద్యార్థులకు పాఠాలు బోధించకుండా జీతాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అకడమిక్ వాతావరణం, పాలనలో పట్టు సాధిస్తారని నూతన ఉపకులపతిగా వస్తున్న ఆచార్య యాదగిరిరావుపై ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు ఆశతో ఉన్నారు.

రిజిస్ట్రార్ మార్పు తప్పదా..?

ప్రస్తుత రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి పదవి కాలం ఎప్పుడో ముగిసింది. ఇన్‌ఛార్జి వీసీల పాలన ఉండడంతో యాదగిరికి రిజిస్ట్రార్ పదవి పొడిగించి కొనసాగిస్తున్నారు. వర్సిటీలో అధ్యాపకుల్ని కట్టడి చేయడం, పరిపాలన సమర్థంగా నిర్వహించడంలో యాదగిరి రిజిస్ట్రార్ పదవికి న్యాయం చేయలేదనే విమర్శలు తీవ్రమయ్యాయి. అయితే కొత్త వీసీగా ఆచార్య టి. యాదగిరిరావు వస్తున్నందున రిజిస్ట్రార్ మార్పు తప్పదని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది.

నిధుల కొరత



వర్సిటీ అభివృద్ధికి పదేళ్లుగా ఒక్క రూపాయి విడుదల చేయడం లేదు. వర్సిటీకి సంబంధించిన నిధులతో పలు నిర్మాణాలు చేపడుతున్న పరిస్థితి. అయితే మరో మహిళా హాస్టల్, ఆడిటోరియం, పరీక్షల విభాగం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

విద్యకు నిధులు వెచ్చించండి

- ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామాల్లో గ్రంథాలయాలను బలోపేతం చేయాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మద్ది చంద్రకాంత్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని తిట్టడమే కేటీఆర్, హరీశ్‌రావు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. వీరు సామాజిక మాధ్యమాల్లో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు దళితులకు మూడెకరాల సాగు భూమి, నిరుద్యోగ భృతి, రెండు పడకగదుల ఇళ్ల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు రూ.70 వేల కోట్ల అప్పుచేస్తే కేవలం పదేళ్లలో కేసీఆర్ ఒక్కడే రూ.7.15 లక్షల కోట్ల అప్పు చేశారని పేర్కొన్నారు. వారు చేసిన అప్పులకు నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించారు. భారాస హయాంలో గుట్టలకు, భవనాలకు రైతుబంధు ఇచ్చారని.. తమ ప్రభుత్వం అర్హులైన రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ చేస్తుందని పేర్కొన్నారు. ఝార్ఖండ్, ఉత్తరాంచల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణను భాజపా ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. విద్య కోసం ప్రజాప్రతినిధులు వారికి వచ్చే నిధుల్లో 10 నుంచి 20 శాతం వెచ్చించాలని పిలుపునిచ్చారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

100 పడకల స్థాయికి పెంపు: షబ్బీర్‌అలీ

దోమకొండ సీహెచ్‌సీ ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకల స్థాయికి పెంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ప్రకటించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు రెండు మూడు రోజుల్లో వస్తాయని పేర్కొన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి నిధుల కోసం కృషి చేస్తామని తెలిపారు. గతంలో పంటలు నష్టపోతే భారాస ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంటనష్ట పరిహారం అందజేశామని పేర్కొన్నారు. ఇప్పుడు ధాన్యం డబ్బులను 3 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. నియోజకవర్గానికి 4 వేల ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన చంద్రకాంత్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్, కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, ఎడ్ల రాజిరెడ్డి, ఇలియాజ్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పండ్లరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు గైర్హాజరు..

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుతో పాటు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూడా కార్యక్రమానికి రాలేదు. దీంతో ఎమ్మెల్యేలు ఎందుకు రాలేదని పార్టీ కార్యకర్తలు చర్చించుకున్నారు.

బాధ్యతల స్వీకరణ



జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రంథాలయంలో ఛైర్మన్ వెంట మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ రాగా ఆయన దస్త్రంలో సంతకం చేశారు. అనంతరం పండితుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ షెట్కార్, పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం


ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

'కేసీఆర్‌తోనే తెలంగాణ రాలేదు'

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: కేసీఆర్‌తోనే రాష్ట్రం ఏర్పాటైందని భారాస ప్రచారం చేయడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఎమ్మెల్సీ, ఆచార్య కోదండరాం పేర్కొన్నారు. వ్యక్తితో కాకుండా ప్రజల సంఘటిత శక్తితో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో టీజేఏసీ(తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతృత్వ పోకడతో గాడి తప్పిన ప్రభుత్వ వ్యవస్థలు ఇప్పుడే సజావుగా సాగుతున్నాయన్నారు. రాష్ట్ర సాధనలో అమరుల కుటుంబాలకు అడుగడుగునా అన్యాయమే జరిగిందన్నారు. వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రజాస్వామికవాదులపై ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధాలు అమలు చేసి.. ఇప్పుడు గ్రూప్-1 రాసే అభ్యర్థులను తమ స్వార్థం కోసం వాడుకోవడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి ఐటీఐలను అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. జేఏసీ నాయకులు గోపాల్ శర్మ, గైని గంగారాం, భాస్కర్, రవీంద్రనాథ్ సూరి తదితరులు పాల్గొన్నారు.

- గుర్తింపుతో సరిపెట్టారు..!
- సాధారణ శిక్షణ.. ఉత్తమ ప్రతిభ

...వివరాలు..6లో

అల్పాహారం ఎలా ఉంది?

పిల్లలూ బాగున్నారా..? చదువుతున్నారా..? అల్పాహారం ఎలా ఉంది..? మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా అని విద్యార్థులను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల వసతిగృహాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతుల లేమిపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

- సదాశివనగర్‌లో అత్యధికంగా 89.5 మి.మీ. వర్షపాతం నమోదు

సదాశివనగర్, న్యూస్‌టుడే : కామారెడ్డి జిల్లాలో అకాల వర్షం రైతులను వెంటాడుతోంది. ఆదివారం సాయంత్రం సదాశివనగర్‌లో 89.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. పిడుగులా విరుచుకుపడిన వర్షం చేతికందిన పంటను నీటిపాలు చేసింది. కోతలకు సిద్ధంగా ఉన్న వందల ఎకరాల్లో పంటలు నేలకొరిగాయి. ఆరబోసిన ధాన్యం నీటిపాలైంది. కల్లాలు, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసి అన్నదాతకు తీరని వేదనను మిగిల్చింది. వరి, మొక్కజొన్న, పత్తి, సోయా తడిసి ముద్దయ్యాయి.

బాలుడి అపహరణ.. 36 గంటల్లో కేసు ఛేదన

- భిక్షాటన కోసం ఘాతుకం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : భిక్షాటన చేయించడానికి ఏడాది వయసున్న బాలుడిని అపహరించిన కేసును 36 గంటల్లోనే పోలీసులు ఛేదించిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన రాజు తన భార్య లక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రి తీసుకొచ్చారు. సాయంత్రం ఓపీ లేకపోవడంతో శనివారం ఉదయం చూపిద్దామనుకొని రాత్రి ఆసుపత్రి ఆవరణలో మూడేళ్ల కూతురు, ఏడాది కుమారుడు మణికంఠతో కలిసి దంపతులు నిద్రించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అంజుమ్ బేగం, ఓ బాలిక(10), దుర్గా ప్రభురావుభా మోహతేలు అర్ధరాత్రి 12.20 గంటల సమయంలో బాలుడిని ఎత్తుకెళ్లారు. ఉదయం లేచిన తల్లిదండ్రులకు కుమారుడు కనిపించకపోవడంతో ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో, బస్టాండు పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నిందితులు బాలుడిని తీసుకొని నాందేడ్ వెళ్లాలని రైల్వే స్టేషన్ చేరుకున్నారు. రైలు లేకపోవడంతో మళ్లీ నగరంలో చక్కర్లు కొట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వీరి వద్ద బాలుడు ఉన్నట్లు ఒకటో ఠాణా పోలీసులకు సమాచారం రావడంతో రైల్వే స్టేషన్ ప్రాంతంలో పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. బాలుడిని మహారాష్ట్ర తీసుకెళ్లి భిక్షాటన చేయించడానికి అపహరించినట్లు అంగీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చిన ఒకటో ఠాణా ఎస్‌హెచ్‌వో రఘుపతి నిందితులను కోర్టులో హాజరుపర్చారు. కేసును ఛేదించడానికి కృషిచేసిన ఏఎస్సై షకీల్, పీసీ గంగారాం, మహిళా కానిస్టేబుల్ అనూష, కానిస్టేబుళ్లు కేర్బాజీ, రాములును అధికారులు అభినందించారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో రఘుపతి, సిబ్బంది

పర్యాటక ప్రణాళికలు.. కార్యరూపం దాల్చేనా..?

● తెరపైకి టెంపుల్ టూరిజం సర్క్యూట్

ఈనాడు, కామారెడ్డి

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కామారెడ్డి జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. నిజాంసాగర్, పోచారం జలాశయాల సందర్శనకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం రిసార్టులు, వసతి గృహాల నిర్మాణాల కోసం భూసేకరణకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. తాజాగా పర్యాటక శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా జిల్లాలోని కాలభైరవస్వామి, సిద్ధరామేశ్వర స్వామి ఆలయాలను బాసర ఆలయంతో కలుపుతూ ప్రత్యేకంగా టెంపుల్ టూరిజం సర్క్యూట్‌ను సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే పర్యాటక అభివృద్ధికి అడుగులు పడి నిరుద్యోగులకు, వివిధ రంగాల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

జలాశయాల వద్ద ఎకో-టూరిజానికి..

నిజాంసాగర్, పోచారం జలాశయాలతో పాటు సమీపంలోని అటవీ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఈ జలాశయాల పరిసరాల్లో పర్యటించి భూసేకరణకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో చారిత్రకంగా పేరొందిన కౌలాస్‌కోట, దోమకొండ కోటలతో పాటు చూడదగిన ప్రదేశాల్లో మౌలిక వసతుల కల్పన, రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలోని జలాశయాలు, సందర్శనీయ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు యంత్రాంగం ప్రతిపాదనలు, ప్రణాళికలు రూపొందిస్తున్నా.. అడుగులు ముందుకుపడడం లేదు. పాలకులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పోచారం జలాశయం వద్ద ఎకో-టూరిజం అభివృద్ధికి ప్రాంతాలను పరిశీలిస్తున్న అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు

చారిత్రక ప్రదేశాలకు నిలయం

నిజాం పాలకుల సమయంలో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు, వందేళ్లు పూర్తిచేసుకున్న పోచారం జలాశయం, వెయ్యేండ్లకు పైగా చారిత్రక వైభవానికి చిహ్నమైన కౌలాస్ కోట రాష్ట్రానికే తలమానికంగా ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో కాలభైరవ స్వామి, సిద్ధరామేశ్వర, సోమేశ్వర, తెలంగాణ తిరుమల, తాండూర్ త్రిలింగేశ్వరాలయం, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలున్నాయి.



గుర్తింపుతో సరిపెట్టారు..!

● విడుదల కాని ఎన్‌క్వాస్ నిధులు
● రెండేళ్లుగా ఎదురుచూపులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్యవిభాగం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్సురెన్స్ స్టాండర్డ్స్) గుర్తింపు అందిస్తుంది. గుర్తింపు పొందిన వాటిలో వసతులు మెరుగుపర్చడానికి నిధులు కేటాయిస్తుంది. కానీ మూడేళ్లుగా ఈ పథకం కింద రావాల్సిన నిధులు విడుదల కావడం లేదు. ప్రజలకు మంచి సేవలందించి గుర్తింపు పొందినా నిధులు రాకపోవడంతో చేపట్టాల్సిన ప్రగతి పనులు ఆగిపోయాయని ఆయా దవాఖానాల వైద్యులు, సిబ్బంది వాపోతున్నారు.





ఉన్నతాధికారులకు నివేదించాం

- రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి

గత రెండు సంవత్సరాలుగా ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన ఏ ఆరోగ్య కేంద్రానికి నిధులు అందలేదు. ఈ నిధులు కోసం ఇటీవల ఉన్నతాధికారులకు సైతం సమాచారం ఇచ్చాం. నిధులు రాగానే ఇస్తామని ఈ నిధులు కేంద్రం నుంచి రావాల్సి ఉంటుందని అవి రాగానే పంపిస్తామన్నారు.

ఎంపికైన వాటికి రూ.3 లక్షలు..

ఎన్‌క్వాస్‌కు ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలకు జాతీయ గుర్తింపుతో పాటు ప్రత్యేకంగా ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లపాటు నిధులు అందిస్తారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచడంతో పాటు ఇతర సేవలకు ఈ నిధులు వాడాల్సి ఉంటుంది.

ఎంపికతో సరిపెట్టిన ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తోంది. సీజనల్ వ్యాధుల విజృంభణతో ఆయా పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉంది. నిధులు వస్తే ప్రజలకు మందులు అందుబాటులోకి తీసుకురావచ్చని ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

ప్రస్తుత పరిస్థితి..

కరోనా కారణంగా రెండేళ్ల పాటు ఎన్‌క్వాస్ గుర్తింపు ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ 2022లో ప్రక్రియ ప్రారంభించారు. 2022-2023, 2023-2024 ఆర్థిక సంవత్సరాలకు నిజామాబాద్ జిల్లాలో చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి, ఎడపల్లి, వేల్పూర్, మెండోరా, దేగాం, పోతంగల్, నందిపేట్, సాలూర పీహెచ్‌సీలు, కామారెడ్డి జిల్లాలో మరో 15 ఎంపికయ్యాయి. యూపీహెచ్‌సీల్లో దుబ్బ, అర్సపల్లి, మాలపల్లి, బోధన్‌లోని రాకాసిపేట, పాన్‌గల్లి, కామారెడ్డి జిల్లాలో 5 ఎంపికయ్యాయి.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భిక్కనూరు, న్యూస్‌టుడే: తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు భాస్కర్‌రెడ్డి గత నెలలో గుండెపోటుతో మృతి చెందాడు. పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఆయన స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఓదార్చారు. రూ.51,000 నగదును భాస్కర్‌రెడ్డి భార్య లక్ష్మి, కూతురుకు అందించారు. స్నేహితుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

సాధారణ శిక్షణ.. ఉత్తమ ప్రతిభ

● క్రీడల్లో సత్తా చాటుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

న్యూస్‌టుడే, బాన్సువాడ

బాన్సువాడ పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొనగా. . 14 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి ఇంత మంది ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఖోఖో విభాగంలో అండర్-17లో నలుగురు, అండర్-14 ఒక్కరు, వాలీబాల్ అండర్-17లో ముగ్గురు, అండర్-14 ముగ్గురు, కబడ్డీలో అండర్-17లో ఇద్దరు, అండర్-14లో ఒక్కరు ఎంపికయ్యారు. వీరితో పాటు మరో వెయిటింగ్ లిస్టులో నలుగురు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వీరందరూ సాధారణ శిక్షణతోనే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారికి నాణ్యమైన శిక్షణ అందిస్తే జాతీయస్థాయిలోనూ రాణించే అవకాశం ఉంది.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాన్సువాడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

ప్రతిరోజు సాధన చేశా

- నందిని, తొమ్మిదో తరగతి

ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యా. ప్రతిరోజు ఉదయం మైదానంలో సాధన చేశా. మంచి శిక్షణ ఇప్పిస్తే మరింత రాణిస్తాం. జాతీయస్థాయిలో ఎంపిక కావాలని ఉంది.

కబడ్డీలో ఎంపికయ్యా

- లావణ్య, పదో తరగతి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యా. గత ఏడాది సైతం ఎంపికై జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. మరోసారి పాల్గొనే అవకాశం ఉంది. ఈ సారి ఉత్తమ ప్రతిభను చాటాలని ఉంది.

జాతీయస్థాయికి అర్హత సాధిస్తా

- సాయిప్రియ, పదో తరగతి

ఇక్కడ వాలీబాల్‌లో చాలా మంది రాణించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని వాలీబాల్ సాధన చేస్తున్నా. జిల్లాస్థాయిలో రాణించా. ప్రస్తుతం రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. అక్కడ ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తా.



మినీ స్టేడియంపై నీలినీడలు

● కూలిన పైకప్పు, ప్రహరీ

న్యూస్‌టుడే, వేల్పూర్

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు సౌకర్యాలు కరవయ్యాయి. మైదానాలున్న చోట నిర్వహణ లోపం వెక్కిరిస్తోంది. యువజన సంఘాల పోరాట స్ఫూర్తితో సాధించుకున్న వేల్పూర్ మినీస్టేడియంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇక్కడ రూ.కోటితో ఇండోర్ స్టేడియం నిర్మించారు. చుట్టూ ప్రహరీ కట్టారు. ఇందులో ఓపెన్ జిమ్ సైతం ఏర్పాటు చేశారు. వేల్పూర్‌తో పాటు పచ్చలనడ్కుడ, వెంకటాపూర్, కోమన్‌పల్లి గ్రామాల నుంచి నిత్యం యువకులు వ్యాయామం, వాకింగ్, రన్నింగ్ కోసం వచ్చేవారు. రెండేళ్ల క్రితం భారీ ఈదురుగాలులకు స్టేడియం పైకప్పు కూలిపోయింది. అప్పటి నుంచి గ్రహణం పట్టింది. బాగు చేసే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇటీవల వర్షాలకు ప్రహరీ సైతం కూలిపోయింది. స్టేడియంలో ఏర్పాటు చేసిన 400 మీటర్ల ట్రాక్ పూర్తిగా గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. విషపురుగులకు అడ్డాగా మారడంతో క్రీడలు ఆడేందుకు ఎవరూ వెళ్లడంలేదు. నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తామంటున్న ప్రభుత్వం ఉన్న వాటిని అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.



గోడ ధ్వంసమైందిలా..

రూ.35లక్షలు మంజూరు :

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్‌లోని ఇండోర్ స్టేడియం మరమ్మతులకు రూ.35లక్షలు మంజూరు అయ్యాయి. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

పిచ్చిమొక్కలు తొలగిస్తాం:

మల్లేష్ జిల్లా క్రీడల నిర్వహణ అధికారి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. ఈ విషయమై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. మైదానంలో గడ్డి, పిచ్చిమొక్కలు తొలగిస్తాం. ఆటలు ఆడుకునే విధంగా చర్యలు చేపడతాం.

సేవలకు దక్కిన గౌరవం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు అందించిన సేవలకు గౌరవం దక్కిందని పీఆర్టీయూ నూతన రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఆదివారం ప్రధానకార్యదర్శికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 8 ఏళ్లుగా కామారెడ్డి జిల్లా అధ్యక్ష పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేశానన్నారు. తనకు పని చేసే అవకాశం కల్పించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గానికి మహేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సర్కారుతో చర్చిస్తున్నామన్నారు. అపరిష్కృత డీఏ, ఇతర బిల్లుల సాధనకు కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడు కుషాల్ అన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శిని ప్రతినిధులు సన్మానించారు.



దామోదర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

78 యూనిట్ల రక్తం సేకరణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: తలసేమియా బాధితులకు అండగా జిల్లాకేంద్రంలో రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 78 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ బాలు మాట్లాడుతూ.. రక్తదానానికి యువత ముందుకురావడం అభినందనీయమన్నారు. ఇప్పటివరకు 4 వేల యూనిట్ల రక్తాన్ని సంస్థ ఆధ్వర్యంలో సేకరించామన్నారు. రక్తదాతల సమూహ అధ్యక్షుడు వేదప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్, అనిల్‌కుమార్, కిరణ్, ప్రతినిధులు చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, గురువేందర్‌రెడ్డి, దత్తాత్రి తదితరులున్నారు.



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసిన బాలు, వేదప్రకాశ్

బూత్‌కి వంద సభ్యత్వాలు స్వీకరించాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి బూత్ పరిధిలో వంద భాజపా సభ్యత్వాలను స్వీకరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి పార్టీలో చేరాలని కోరాలన్నారు. వంద మంది ప్రాథమిక సభ్యత్వాలు చేపడితేనే పార్టీ క్రియాశీల సభ్యత్వానికి అర్హులన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధానకార్యదర్శి బండారి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు ఆకుల భరత్, నాయకులు శ్రీధర్, రమేశ్, రంజిత్, సురేశ్, అనిల్, ఆనంద్‌రావు, రవీందర్, రఘు, రజినీకాంత్ తదితరులున్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



ఉపాధ్యాయులతో మున్నూరుకాపు సంఘ ప్రతినిధులు



సౌజన్యను సన్మానిస్తున్న ఠాణా సిబ్బంది

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: మున్నూరుకాపు సామాజికవర్గం నుంచి ఇటీవల నూతన ఉపాధ్యాయులుగా ఎంపికైన 28 మందిని జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమానికి విద్యాశాఖ డీసీఈబీ కార్యదర్శి నీలం లింగం హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, ప్రతినిధులు పద్మ, భాస్కర్, లింగం, అనిల్, నారాయణ తదితరులున్నారు.

పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో...

మాచారెడ్డి, న్యూస్‌టుడే: మాచారెడ్డి ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన సౌజన్య డీఎస్సీలో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆమెను ఠాణా సిబ్బంది ఆదివారం సన్మానించి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్, సిబ్బంది శ్రీకాంత్, నర్సింలు, రామరావు, తిరుపతి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి



చదరంగంలో ప్రతిభ చాటిన విద్యార్థులతో సంఘం ప్రతినిధులు

ఉమ్మడిజిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు పూర్తి

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో అండర్-14 బాలబాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

విజేతల వివరాలు..బాలురు : సింగిల్స్‌లో: విజేత మిథున్, ద్వితీయ వీర్, తృతీయ శ్రీకర్


డబుల్స్‌లో : విజేత సాత్విక్, ఆదాయ్, ద్వితీయ వీర్, మిథున్

బాలికలు : సింగిల్స్‌లో : విజేత ప్రశాంతి, ద్వితీయస్థానం శ్రీనిధి, తృతీయ వైష్ణవి

డబుల్స్‌లో : విజేత అక్షర, సాన్విక, ద్వితీయ అర్చన, వైష్ణవి, తృతీయ స్థానం సాత్విక, ప్రశాంతి

ఖోఖోలో..

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలను కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల నుంచి రిత్విక, మనోజ్ఞ, కీర్తి, ఆరాధ్య, రిసిక, రమ్య, నేహా, స్నేహ, నిహారిక, దుర్గాలక్ష్మి, అనన్య, వైష్ణవి, పూజిత, అపూర్వలు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర నుంచి ఆదర్శ్, శివ, నవీన్, శ్రీకాంత్, ప్రత్యూష్, రాజేశ్, నిఖిల్, ముఖేశ్, ఆకాశ్, మహేందర్, కిషన్, సాత్విక్, రేవంత్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, రాము, అశోక్, సురేశ్, సుజాత, నరేశ్‌రెడ్డి, సాయిబాబా, లింగం పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలికల జట్టు

చదరంగంలో..

నిజామాబాద్ క్రీడావిభాగం: నగరంలోని అభ్యాస ఉన్నత పాఠశాలలో చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15 బాలబాలికల విభాగంలో ఆదివారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రతినిధులు బహుమతులు అందించారు. చదరంగం క్రీడాకారులు చదువులోనూ రాణిస్తారని సంఘం ప్రధాన కార్యదర్శి రమేశ్ అన్నారు. ఉపాధ్యక్షుడు అబ్బాపూర్ రవీందర్, సంయుక్త కార్యదర్శి గంగాధర్, ప్రతినిధులు లక్ష్మణ్, నవ్యకృష్ణ, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు: బాలుర : అభిజిత్(అభ్యాస ది స్కూల్), సాయిరుద్ర(కాకతీయ ఒలింపియాడ్ స్కూల్)

బాలికల : రిషిత(నలంద ఉన్నత పాఠశాల), రోషిణి(అభ్యాస ది స్కూల్)

కబడ్డీలో ప్రతిభ..

మాచారెడ్డి, న్యూస్‌టుడే: పల్వంచ మండల ఫరీద్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన కమ్మరి నీరజ్, కొంపల్ల శీర్షికలు కబడ్డీ అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. వచ్చే నెల 3వ తేది నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే క్రీడల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం రామ్మోహన్‌రావు అభినందించారు.

ఒకరికి తాఖీదు .. మరొకరి తొలగింపు

జుక్కల్, న్యూస్‌టుడే: 'ఈనాడు'లో ఈ నెల 19న 'వసతిగృహ విద్యార్థులను ఇంటికి పంపించేశారు..!' శీర్షికన ప్రచురితమైన కథనానికి షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారిణి రజిత స్పందించారు. ఆదివారం జుక్కల్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేసి, విచారణ చేపట్టారు. పొరుగు సేవల విధానం కింద విధులు నిర్వస్తున్న ఒకరిని విధుల నుంచి తొలగించామని, మరొకరికి తాఖీదు జారీ చేసినట్లు ఆమె 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఇక్కడ విధులు నిర్వహించే ఇన్‌ఛార్జి సంక్షేమాధికారి వీరప్పకు ఉపాధ్యాయ ఉద్యోగం రావడంతో రిలీవ్ చేసి, మద్నూర్‌లోని సంక్షేమాధికారి సందీప్‌నకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. విధుల నుంచి తొలగించిన సిబ్బంది స్థానంలో మరొకరు పనిచేసేలా చర్యలు తీసుకొన్నామన్నారు. వెంట సహాయ సంక్షేమాధికారి వెంకటేశ్వర్ రావు, వీరప్ప తదితరులు ఉన్నారు.





వసతి గృహంలో విచారణ చేస్తున్న ఎస్సీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారిణి రజిత

రాష్ట్రస్థాయికి క్రికెట్ జట్టు

దోమకొండ, న్యూస్‌టుడే: గడీకోట ట్రస్టు, ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ సంయుక్తంగా నిజామాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ ఎంపిక పోటీలు ఆదివారం దోమకొండలోని ఆనంద్ భవన్ మైదానంలో నిర్వహించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి 78 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఉమ్మడి జిల్లా స్థాయి జట్టుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, గడీ కోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్, నాయకులు శంకర్‌రెడ్డి, మధు, కోచరు రామక్రిష్ణ, పీఈటీలు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో ప్రతినిధులు

ఏషియన్ ప్రియ సినీప్లెక్స్ — ఈనాడు సినిమాలు


వేట్టయాన్ ది హంటర్ 11.00 2.15 6.00 9.15
విశ్వం 11.00 2.00 6.00 9.00

వి సినిమాస్
దేవర 5.50 9.15

ఏషియన్ దర్పన్
మార్టిన్ 6.00, 9.00

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



స్పందన: కామారెడ్డిలోని రాజానగర్‌లో మురుగు కాల్వ పూడిక తీయకపోవడంపై స్థానికుడు గణేశ్ సమస్యను ఈనాడు దృష్టికి తేగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి పరిష్కరించారు.

సమస్య: జిల్లాకేంద్రంలోని 9వ వార్డులో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. **-భాస్కర్, 9వ వార్డు**


స్పందన: పారిశుద్ధ్య మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాం. **-పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**





సమస్య: బాన్సువాడ రెండు పడక గదుల కాలనీలో మురుగు కాల్వలు చెత్తతో నిండి అధ్వానంగా మారాయి - **రాహుల్, బాన్సువాడ**

పరిష్కారం: ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య పరిష్కరించారు.



సమస్య: మార్ధండలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వస్తోంది. **సాయిలు, స్థానికుడు**

సమాధానం: మురుగుకాల్వలు శుభ్రం చేయిస్తాం. **రాములు, పంచాయతీ కార్యదర్శి, మార్ధండ.**

సమస్య: తాండూరు గ్రామంలో పందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **రాజు, తాండూరు.**

సమాధానం: త్వరలో పందుల బెడదను నివారించి సమస్యను పరిష్కరిస్తాం. **బాలరాజ్, కార్యదర్శి.**

సమస్య : రామారెడ్డి ప్రాథమిక పాఠశాలలో చెత్త పేరుకుపోయింది. **ప్రసాద్, గ్రామస్థుడు.**

సమాధానం : పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తీసివేయిస్తాం. విద్యార్థులకు సమస్య రాకుండా కృషి చేస్తాను. **క్రాంతి, పంచాయతీ కార్యదర్శి.**

సమస్య: పెద్దమల్లారెడ్డి నుంచి దోమకొండకు ఉదయం 9 గంటలకు బస్సు నడపాలి. కళాశాలకు చేరుకోలేకపోతున్నాం. **- సుష్మిత, ఇంటర్ విద్యార్థిని, దోమకొండ**

సమాధానం: మార్గాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ఇందిర, కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్**

-న్యూస్‌టుడే,రామారెడ్డి, దోమకొండ, పిట్లం, కామారెడ్డి పట్టణం, నాగిరెడ్డిపేట , బాన్సువాడ

భూమి పూజకు రావాలని ఆహ్వానం

ఎల్లారెడ్డి : టీఎన్జీవోస్ భవన నిర్మాణ భూమి పూజకు రావాల్సిందిగా ప్రతినిధులు ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ఆహ్వానపత్రం అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు. ప్రతినిధులు మహిపాల్, రాజగౌడ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యక్షుల ఎన్నిక

తాడ్వాయి, న్యూస్‌టుడే: తాడ్వాయి మండల కాంగ్రెస్ కమిటీలో ఇద్దరిని ఉపాధ్యక్షులుగా ఎన్నిక చేసినట్లు అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు పార్టీలో పనిచేస్తున్న ఇద్దరు కార్యకర్తలు అవుసుల లక్ష్మణాచారి (ఎర్రపహాడ్), గైని శివాజీ (సంగోజివాడి)లను ఉపాధ్యక్షులుగా ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు మండలాధ్యక్షుడు వారికి నియామక పత్రాలను అందజేశారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా కృష్ణాజివాడికి చెందిన బాలయ్యను ఎంపిక చేశారు.

ఓపెన్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఓపెన్ పది/ఇంటర్ ప్రవేశాలగడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు కేంద్రం సమన్వయకర్త కిషోర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బడి మానేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న విచారణ

భిక్కనూరు, న్యూస్‌టుడే: రైలులో బంగారం దొంగతనం కేసులో కాచిగూడ రైల్వే పోలీసుల విచారణ కొనసాగుతోంది. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానితులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వారు ఇచ్చిన సమాచారంతో తాజాగా ఆదివారం మరో వ్యక్తి వివరాలు సైతం గ్రామస్థుల ద్వారా పోలీసులు సేకరించినట్లు సమాచారం. ఈ నెల 13న దుర్గామాత నిమజ్జనం సందర్భంగా డప్పు కొట్టడానికి పెద్దమల్లారెడ్డి నుంచి కాచిగూడకు రైలులో వెళ్లిన వారిలో కొంత మందికి ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు తెలిసింది. రైల్వే పోలీసులు చాకచక్యంగా తమకు డప్పు కొట్టడానికి మనుషులు కావాలని, ఒక్కొక్కరికి రూ.2000 ఇస్తామని పెద్దమల్లారెడ్డి వ్యక్తికి ఫోన్ చేశారు. అది నమ్మిన వారు చిరునామా చెప్పడంతో శనివారం స్థానిక పోలీసుల సాయంతో పెద్దమల్లారెడ్డి వచ్చి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.



దోమకొండలో..



ఎల్లారెడ్డిలో..



నాగిరెడ్డిపేట్‌లో..



జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో

భారాస శ్రేణుల నిరసన

రైతు భరోసాను అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా మండలకేంద్రాల్లో భారాస శ్రేణులు ఆదివారం నిరసన తెలిపారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందనీ.. ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని భారాస నాయకులు ధ్వజమెత్తారు. వానాకాలం సాయాన్ని ఇవ్వలేమని చెప్పడమే కాకుండా ఉప సంఘం వేసి దాని నిర్ణయం మేరకు యాసంగి నుంచి అమలు చేస్తామని చెప్పడం ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు. జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, బీబీపేటలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ ప్రేమ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**



భిక్కనూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల దిష్టిబొమ్మ దహనం



సదాశివనగర్‌లో...



గాంధారిలో...



బిచ్కుందలో...



బాన్సువాడలో..

నానీజ్ చేరుకొన్న 'వసుంధర' పాదయాత్ర

జుక్కల్, న్యూస్‌టుడే: స్వామి నరేంద్ర చార్యజీ మహరాజ్ సూచనల మేరకు గత నెల 25న తెలంగాణ ఉప పీఠం నుంచి ప్రారంభమైన 'వసుంధర' పాదయాత్ర ఆదివారం మహారాష్ట్రలోని నానీజ్‌ధామ్‌కు చేరుకొన్నట్లు భక్తులు తెలిపారు. జుక్కల్ మండలం బంగారుపల్లి-దోస్తుపల్లి పరిధిలో తెలంగాణ ఉప పీఠం ఉంది. ఇక్కడి నుంచి భక్తులు పాదయాత్ర మొదలుపెట్టి 26 రోజుల్లో సుమారు 650 కి.మీ దూరం కాలినడకన వెళ్లారు. ఈ యాత్ర తెలంగాణలో ప్రారంభమై కర్ణాటక మీదుగా మహారాష్ట్రకు చేరుకొంది. మార్గమధ్యలో మూడు రాష్ట్రాల్లోని ఆయా జిల్లాల భక్తులు భారీ సంఖ్యలో భాగస్వాములయ్యారు. భూతాపంపై ప్రజలను జాగృతం చేయాలనే ఉద్దేశంతో ఈ యాత్ర మొదలైంది. చెట్లను నాటడం, కాలుష్యాన్ని నివారించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం తదితర నినాదాలతో ఫ్లెక్సీలు పట్టుకొని వందల కి.మీ. దూరం పాదయాత్ర కొనసాగించారు.



కాలినడకన పీఠానికి వెళ్తున్న భక్తులు

28న పండరీపూర్ పాదయాత్ర

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పండరీపూర్ క్షేత్రానికి ఈ నెల 28న మహాపాదయాత్ర చేపట్టనున్నట్లు మహరాజ్‌లు, వార్‌కారీలు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలో ఆదివారం ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఆవిష్కరించారు. దుర్కి సోమలింగేశ్వరాలయం, బాన్సువాడ సంగమేశ్వరాలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు మహరాజ్, నాందేవ్, శంకర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ నర్సింలు, చిన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ఎంపీ పూజలు

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండ మండలం అంబారిపేటలోని మైసమ్మ ఆలయంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యులతో ఆయన ఆదివారం అమ్మవారిని దర్శించుకుని మొక్కుకున్నారు. ఆయనను మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు సన్మానించారు.

ఊర పండుగ

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే : దేశాయిపేటలో ఊర పండుగను ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఆలయాల చుట్టూ ఎండ్లబండ్లు, ఇతర వాహనాలు ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రకాష్, రమణ, విఠల్, విక్రం పంతులు, బసవంతరావు, వీరప్ప, పండరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్లకు కలిసి.. గురువులను సన్మానించి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని ప్రగతి విద్యాలయానికి సంబంధించి 1999, 2008 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు బాపురావు, సిబ్బంది వెంకట్‌రావు, శివకుమార్, హుస్సేన్, వెంకట్, స్వర్ణలత, భారతి, కృష్ణారావులున్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: తాండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. బాల్యమిత్రులు ఒకే వేదికపై కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, భీంరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆగమయ్య, నర్సింలు, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మెట్ల బావి సందర్శన

లింగంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని నాగన్న మెట్ల బావిని ఆదివారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్ తన మిత్ర బృందంతో సందర్శించారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణ అభినందనీయమని కొనియాడారు. కామని సుదర్శన్, చింతల శంకర్, సురేందర్,నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



మిత్ర బృందంతో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్

బోనమెత్తిన ఎమ్మెల్యే

గాంధారి, న్యూస్‌టుడే: భక్తితో ముక్తి లభిస్తుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆదివారం గౌరారంలో నిర్వహించిన గ్రామ దేవతల బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్థులతో పాటు బోనం నెత్తిన పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని శ్రీరామ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం మేడిపల్లిలోని నూతన శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్నారు. వెంట నాయకులు గ్రామస్థులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

గాంధారి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రం శివారులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. నాగ్లూర్‌కు చెందిన భాస్కర్‌రావు(42) గుడిమెట్ వద్ద ఓ రైస్‌మిల్లులో పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై గాంధారి వైపు వస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొనడంతో కిందపడి తలకు తీవ్ర గాయమై దుర్మరణం చెందాడు. మృతుడి భార్య లీలావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. భాస్కర్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు.



భాస్కర్‌రావు

పాము కాటుతో వృద్ధురాలి మృతి

లింగంపేట, న్యూస్‌టుడే: పాము కాటుకు గురై వృద్ధురాలు(64) మృతి చెందింది. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వ(64) పది రోజుల క్రితం ఎండ్రియాల్ వెళ్లి ఆదివారం తిరిగి వచ్చింది. ఇంటి తలుపు తీసి లోపలికి వెళ్లగానే ఒక్కసారిగా పాము కాటువేయడంతో కేకలు వేసింది. గమనించిన చుట్టుపక్కల వారు కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.



గంగవ్వ

పెళ్లి కావట్లేదని ఆత్మహత్య

భిక్కనూరు, న్యూస్‌టుడే: పెళ్లి కావట్లేదని మనస్తాపంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జంగంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాసుల సంతోష్(26) వ్యవసాయదారుడు. కొంత కాలంగా తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూసినా కుదరలేదు. శనివారం సాయంత్రం తల్లిదండ్రులు బయటకి వెళ్లగా.. సంతోష్ తన ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు అతడిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తమ్ముడు సతీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



సంతోష్

మహిళ..

మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహ్మద్‌నగర్‌లో గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

జూదరులపై కేసు నమోదు...

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: మూడు పేకాట స్థావరాలపై దాడి చేసి 15 మంది జూదరులపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో ఒకటి, విఠల్‌వాడీ సమీపంలో రెండు స్థావరాలపై దాడి చేసి రూ.30వేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వరి కోత యంత్రం బోల్తా

రామారెడ్డి: రామారెడ్డిలోని గంగమ్మవాగు వంతెన వద్ద శనివారం రాత్రి వరికోత యంత్రం బోల్తా పడినట్లు గ్రామస్థులు తెలిపారు. వ్యాన్‌లో యంత్రాన్ని తరలిస్తుండగా సర్వీస్ రోడ్డుపై వాహనం దిగబడింది. వరికోత యంత్రాన్ని నుంచి దించుతుండగా ఒకవైపు వంగి బోల్తా పడినట్లు పేర్కొన్నారు. ఘటనలో డ్రైవరు సురక్షితంగా బయటపడ్డాడు. గంగమ్మవాగు వంతెన పనులు తొందరగా పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వాహనాల తనిఖీ

గాంధారి, న్యూస్‌టుడే: ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందడంతో మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్‌గడ్డ సమీపంలో ఎస్సై గంగారం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని చోదకులకు జరిమానాలు విధించారు. కానిస్టేబుల్స్ శంకర్, సుభాష్, సిబ్బంది బంతిలాల్ పాల్గొన్నారు.

నలుగురికి తీవ్రగాయాలు

గాంధారి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నల్లమడుగుకు చెందిన మగ్గిడి ప్రసాద్, సోహెల్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వరికోత యంత్రం(మిషన్) ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నట్లు అక్కడి వైద్యులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని ఆటో ఢీకొని

గాంధారి: నడుచుకుంటూ.. వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని ఆటో ఢీకొన్న ఘటన మండల కేంద్రంలోని పెద్దవాగు వంతెన సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ఓ మేస్త్రీ మద్యం మత్తులో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. గుర్తుతెలియని ఆటో వచ్చి ఢీకొని వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. గాయాలు అయిన సదరు వ్యక్తిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

జంగంపల్లి శివారులో...

భిక్కనూరు, న్యూస్‌టుడే: జంగంపల్లి శివారులో జాతీయ రహదారి 44పై ద్విచక్రవాహనంపై నుంచి పడి నిజామాబాద్‌కు చెందిన పదవీ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగి రాజేంద్రుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు.

సీఐ చొరవతో సైబర్ మోసానికి చెక్

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సత్వరమే స్పందించడంతో సైబర్ మోసానికి చెక్ పెట్టగలిగారు. జిల్లాకేంద్రంలోని గురురాఘవేంద్ర కాలనీలో నివాసముండే రవికిరణ్‌కుమార్ చరవాణికి పోలీసుల పేరిట ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. 'మీ కూతురు డ్రగ్స్ కేసులో అరెస్టైంది. ముంబయి తీసుకెళ్తున్నాం. మీ కూతురు కేసు నుంచి బయట పడాలంటే రూ.లక్ష పంపించాలి' అంటూ సదరు వ్యక్తి రవికిరణ్‌కుమార్‌ను డిమాండ్ చేశారు. రవికిరణ్‌కుమార్ ఫోన్‌చేసిన వ్యక్తిని లైన్‌లోనే ఉంచి పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చి సీఐని కలిశారు. స్పందించిన సీఐ చంద్రశేఖర్‌రెడ్డి రవికిరణ్‌కుమార్ చరవాణి తీసుకొని గుర్తుతెలియని వ్యక్తితో మాట్లాడగా.. అదంతా అబద్ధమని తేలింది. దీంతో వెంటనే సదరు వ్యక్తి ఫోన్ స్విచాఫ్ చేశాడు. సీఐ సదరు ఫోన్ నంబర్‌ను బ్లాక్‌లో పెట్టడంతో సైబర్ మోసాన్ని నిలువరించగలిగారు. పట్టణ సీఐకి కృతజ్ఞతలు తెలుపుతూ రవికిరణ్‌కుమార్ వీడియోను విడుదల చేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని విలీనగ్రామం పాతరాజంపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ డైరెక్టర్ రాజు ఆదివారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సిలర్ ఆకుల రూప, నాయకులు రవికుమార్, రాజు, రవి, నరేశ్, రాములు, వెంకట్‌గోపాల్, రాజయ్య, బాలయ్య, లక్ష్మణ్, భాస్కర్, మోహన్‌రావు తదితరులున్నారు.



సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

పనులు త్వరగా పూర్తి చేయాలి

బాన్సువాడ: పట్టణంలోని మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాంతీయ ఆసుపత్రి నూతన భవనం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న షెడ్డు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆగ్రోస్ రాష్ట్ర ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు ఖాలెక్, బాబా, గౌస్, రాజు, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం

కామారెడ్డి పట్టణం: ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నరేందర్, ప్రధాన కార్యదర్శిగా లింబాద్రి, గౌరవాధ్యక్షుడిగా అనిల్, ఉపాధ్యక్షులుగా విజయ్, సంగయ్య, కార్యదర్శిగా శ్రీను, సభ్యులుగా సతీశ్, శ్యాంరాం, ఏసురత్నం, మోహన్, సుధారాణి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు.

గురువులు మార్గదర్శకులు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికి గురువులే మార్గదర్శకులని ధర్మ టీచర్స్ యూనియన్(డీటీయూ) రాష్ట్ర నాయకులు అశోక్, హరికిషన్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం డా.అంబేడ్కర్ గురువు ప్రొఫెసర్ జాన్ డ్యూయీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహనీయుల ఆలోచన విధానాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శంకర్, లక్ష్మణ్, దేవేందర్, రాజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌శర్మ హాజరయ్యారు. సమాజంలో బ్రాహ్మణులంతా.. ఐక్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణ సంఘం సభ్యులు జిల్లాధ్యక్షుడిని సత్కరించారు. కార్యక్రమంలో కులకర్ణి ప్రదీప్‌రావు, ఆకాష్‌శర్మ, కులకర్ణి శ్రీనివాస్‌రావు, చంద్రకాంత్‌రావు, ఉమాకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.